క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

బోట్‌క్లబ్: ప్రభుత్వ ఆదేశాల మేరకు **జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా** సోమవారం ఉదయం 9.30 నుంచి **10.30** వరకూ డయల్ యువర్ కమిషనర్ **నిర్వహిస్తున్నట్లు** నగరపాలక సంస్థ కమిషనర్ **సీహెచ్** నాగనరసింహారావు ఆదివారం ఒక **ప్రకటనలో** తెలిపారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయాలన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 10.30కు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన యథావిధిగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా విశ్వనాథ జయంతి



కవి సామ్రాట్ విశ్వనాథకు నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు నివాళులర్పించారు. ఆయన గౌరవార్థం తపాలా బిళ్ల విడుదలైందని, కళా ప్రపూర్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, పద్మభూషణ్, జ్ఞానపీఠ్ వంటి అత్యుత్తమైన పురస్కారాలు అందుకున్నారన్నారు.

జీఈఎఫ్ జిల్లా కార్యవర్గంలో వైఎస్సార్ టీఎఫ్‌కు స్థానం



నక్కా వెంకటేశ్వరరావు(ఫైల్)

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్‌గా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని వెంకటేశ్వరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఏపీ జీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి తనను జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ నియామక ఉత్తర్వులు ఇచ్చారన్నారు. జీఈఎఫ్ అసోసియేషన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెంకటేశ్వరరావు తెలిపారు.

వన్ టౌన్ సీఐగా సురేష్‌బాబు



కాకినాడ క్రైం: కాకినాడ వన్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.సురేష్‌బాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 2009 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్‌ఐగా సీతానగరం, బిక్కవోలు, జగ్గంపేటల్లో పనిచేశారు. 2017 డిసెంబర్‌లో సీఐగా పదోన్నతి పొంది తొలి పోస్టింగ్ కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. నర్సాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సురేష్‌బాబు సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ వన్ టౌన్ పీఎస్‌కు బదిలీ అయ్యారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని సీఐ కె.దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. కెనాల్ రోడ్డులోని హుస్సేన్‌పురం ఎస్సీపేట వద్ద కాలువలో మృతదేహం ఉందనే సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉందని, వివరాలకు సీఐ 94407 96568, ఎస్సై టి.సునీత 97016 26505 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'గడప గడప'లో సంక్షేమం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన అభివృద్ధి రూ.50 కోట్ల పైమాటే
- ఇవి కాక సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చేయూత
- వ్యక్తిగతంగా ఎంతో మందికి పింఛన్లు



గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి (ఫైల్)

కాకినాడ: సుమారు ఎనిమిది నెలల క్రితం ప్రారంభమైన గడప గడపకూ మన ప్రభుత్వం సిటీ పరిధిలో దాదాపు పూర్తి కావచ్చింది. కార్పొరేషన్‌లోని 50 డివిజన్లకు సిటీ పరిధిలో ఉండే 42 డివిజన్లకు ఇప్పటికే 40 డివిజన్లలో పూర్తి చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటింటి వెళ్తూ ప్రజల కష్టాలు, బాధలు, ఇబ్బందులను ఓపికగా వింటూ వాటిని పరిష్కరిస్తూ ఓప్రజా ఈ ప్రభుత్వం మీ కోసమే పనిచేస్తోందనే భరోసా ఇచ్చారు. కుటుంబ పెద్దను కోల్పోయి చదువుకోసం ఇబ్బందులు పడుతున్న పిల్లలను దత్తత తీసుకుని సొంత ఖర్చులతో చదివించే బాధ్యతలను ఆయన తీసుకున్నారు. సాంకేతిక కారణాలతో పింఛన్ దక్కని ఎంతో మందికి సొంత సొమ్ము నెలనెల ఇస్తూ భరోసాగా నిలిచారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని ఎందరో వ్యాధిగ్రస్తులకు సీఎం సహాయ నిధి నుంచి తోడ్పాటు అందించారు. 100 మంది నిరుద్యోగులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు వేయించారు. ఇక కార్పొరేషన్‌తో పాటు, ఇతర ప్రభుత్వ శాఖల్లో 50 వరకు కారుణ్య నియామకాలు ఇప్పించారు.

రూ.16 కోట్లతో అభివృద్ధి పనులు

గడప గడపకు ప్రభుత్వంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి సచివాలయ పరిధిలో రూ. 20లక్షలను ప్రభుత్వం కేటాయించగా 40 విజన్లకు రూ.16 కోట్లతో అనేక అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, వాటిలో 72 పనులకు 9.18 కోట్ల మేర టెండర్లు కూడా పిలిచారు. ఇవి కాక మరో రూ.10 కోట్లు వరకు కార్పొరేషన్ సాధారణ నిధులు వెచ్చించి నగరాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారు. దాదాపు అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పన పూర్తవుతున్న నేపథ్యంలో త్వరలోనే మరోసారి ప్రజల్లోకి వెళ్ళి 'విన్నాం–చూశాం–చేశాం' పేరుతో వెళ్ళేందుకు ఎమ్మెల్యే సమాయత్తమవుతున్నారు. సీఎం జగన్ ఆకాంక్షకు అనుగుణంగా సిటీలో గడప గడపకూ మన ప్రభుత్వం విజయవంతం కావడంతో ఇక్కడి పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

ఎంతో సంతోషంగా ఉంది



ప్రజల్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరించడం గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా దోహదపడింది. సుమారు 30 వేల మందికి ఇళ్ల స్థలాలను కూడా ఇచ్చి ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్నాం. దాదాపు అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యింది. ఒక ప్రజాప్రతినిధిగా ఇంతకన్నా ఏం కావాలి? ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయగలిగామన్న సంతృప్తి సంతోషాన్నిస్తోంది. సిటీ పరిధిలో నగర పరిధిలో ఇప్పటి వరకు రూ.669 కోట్లు లబ్ధిదారులకు అందింది. ఇలాంటి ప్రభుత్వంలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, కాకినాడ



విజయరాయుడుపాలెంలో కొత్త పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు

కొత్త పింఛన్ల పంపిణీ

కరప: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు గ్రామ కార్యదర్శులు, వలంటీర్లతో కల్సి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. విజయరాయుడుపాలెంలో గ్రామసర్పంచ్ వెలుగుబంట్ల సీతారామరాఘవ, మండల సచివాలయాల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. యండమూరు, జి.భావారం తదితర గ్రామాల్లో కూడా సర్పంచ్‌లు మార్నెళ్ల శివ, రొక్కాల గణేష్ లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేశారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ కార్యవర్గ సభ్యునిగా రంగారావు



రంగారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ కార్యవర్గ సభ్యునిగా జిల్లాకు చెందిన సీనియర్ పీడీ టీవీఎస్ రంగారావు ఎన్నికయ్యారు. ఆదివారం విశాఖ ఎలిగంట్ హోటల్‌లో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం టీవీఎస్ రంగారావు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అథ్లెటిక్స్ సంఘానికి ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన రంగారావును జిల్లా అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పీడీలు గిరి, నూకరాజు, రవిరాజు, జార్జి, బంగార్రాజు, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్, ఒలింపిక్ సంఘ సభ్యులు డాక్టర్ జి.ఎలీషాబాబు తదితరులు అభినందించారు.

ఆరోగ్య సమాజానికి కృషి చేద్దాం



కుసుమ ఆస్పత్రిలో కిడ్నీ అండ్ ఆండ్రోకేర్ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ నరసింహం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రస్తుత సమాజంలో అనేక అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలను రక్షించడంలో వైద్యులు ప్రత్యేక శ్రద్ధ కనబరచడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని ఆవిష్కరించేందుకు వీలుంటుందని ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డీవీఎస్ఎల్ నరసింహం అన్నారు. ఆదివారం కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న కుసుమా హాస్పిటల్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్నీ అండ్ ఆండ్రోకేర్ నూతన విభాగాన్ని ముఖ్యఅతిథి నరసింహం, ప్రముఖ యురాలజీ వైద్యులు ఎస్‌వీఎస్ రావు, ఆపరేషన్ థియేటర్‌ను డాక్టర్ పుల్లారావు ప్రారంభించారు. యూరాలజీ రంగ సేవలు నేటి తరానికి ఎంతో అవసరమని అవగాహన లోపంతో అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. కాకినాడ వంటి నగరంలో అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన కిడ్నీ అండ్ ఆండ్రోకేర్ అధినేత డాక్టర్ కార్తీక్ హరీస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నరసింహంను హాస్పిటల్ అధినేత టీవీ బాలకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఐవీ రావు, జీవీ కృష్ణప్రకాష్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, అభిలాష్, వైజయంతి, అనుపమ, జాహ్నవి, భూపేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణభగవానుని ఊరేగింపు



నగర వీధుల్లో శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: ప్రభోత సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జేఎన్‌టీయూకే ఎదురుగా కృష్ణాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణభగవానుడిని ప్రతిమను ఆదివారం ఊరేగించారు. సమితి అధ్యక్షుడు సలాది అనిల్‌కుమార్ మాట్లాడుతూ దేవుడే మనిషిగా అవతరించి మనిషిగా జన్మిస్తే ఆయననే భగవంతుడు అంటామన్నారు. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు అన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భారత్‌పై రాద్ధాంతం అనవసరం



చిట్నీడి శ్రీనివాస్

బోట్‌క్లబ్: ఇండియా పేరును భారత్‌గా మార్పు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్నీడి శ్రీనివాస్ అన్నారు. స్థానిక సాంబమూర్తినగర్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వలసవాద చిహ్నంగా ఉన్న ఇండియా అనే పదాన్ని తొలగించి చారిత్రాత్మక సాంస్కృతిక వారసత్వంగా ఉన్న భారత్‌ను కొనసాగించాలన్న నిర్ణయం ఎంత మాత్రం అభ్యంతరం కాదన్నారు. ప్రపంచంలో చాలా దేశాలు వలస దేశాల పాలన నుంచి విముక్తి పొందాక వాటి పేరు మార్చుకున్నాయన్నారు. సిలోన్ 2011వ సంవత్సరం శ్రీలంకగా మారిందన్నారు. మలయ 1963లో మలేషియాగాను, హాలెండ్ 2020లో నెదర్లాండ్స్‌గా మారిందన్నారు. ఈ రోజు దేశం పేరు మార్పుపై రాద్ధాంతం చేస్తున్న కమ్యూనిస్టులు 2001లో కలకత్తాను కోల్కటగా మార్చడం జరిగిందన్నారు. దానిని ఎందుకు మార్చారో వారు చెప్పగలరాని ప్రశ్నించారు.

నగరవాసులకు ఏయూ డాక్టరేట్ల ప్రదానం



పీహెచ్‌డీ అందుకుంటున్న ఆశ్రమ్ స్కూల్ ప్రిన్సిపాల్ అగస్త్యన్



దంగేటి ఏడుకొండలుకు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

బాలాజీచెరువు: ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో నగరానికి చెందిన ఇద్దరు అధ్యాపకులకు శనివారం డాక్టరేట్లు ప్రదానం చేశారు. ఆశ్రమ్ స్కూల్ ప్రిన్సిపాల్ టి.అగస్త్యన్‌కు అప్లయిడ్ మ్యాథమేటిక్స్‌లో ప్రదానం చేశారు. నెట్‌వర్క్ చొరబాటు గుర్తింపు వ్యవస్థల కోసం కొన్ని ప్రభావవంతమైన ఫీచర్ల ఎంపిక, సాంకేతికతల రూపకల్పనలో వర్గీకరణ, పనితీరు మూల్యాంకనం అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని వర్సిటీ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో సమర్పించారు. అలాగే మల్లాడి సత్యలింగనాయకర్ డిగ్రీ కళాశాల రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు దంగేటి ఏడుకొండలకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఎ స్టడీ ఆన్ టీడీపీ కొత్త రాజకీయ క్రమంపై సిద్ధాంత వ్యాసం రచించారు. పరిశోధనకు గైడ్‌గా ఏయూ పీజీ క్యాంపస్ పూర్వ ప్రత్యేక అధికారి ఐ.దొనగిరిరావు వ్యవహరించారు. పీహెచ్‌డీతో పాటు రఘుపతి వెంకటరత్నం రీసెర్చ్ మెడల్ ప్రదానం చేశారు. వీరు ఇరువురికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అందజేశారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



కరప కొత్తపేటలో పందిరి రాట వేసి పూజలు చేస్తున్న భక్తులు

కరప: స్థానిక కొత్తపేటవీధిలో 16వ గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఆదివారం పందిరి రాట వేశారు. నక్కా వీరభద్రరావు, తుమ్మలపల్లి మహేష్(చిన్ని), దాసరి సూరిబాబు, గొల్లపల్లి అమ్మిరాజు, నక్కా శివ, మండా రవి, నక్కా అఖిల్ తదితరులు పాల్గొన్నారు. పాత వినాయకుని గుడి సెంటర్‌లో గణేష్ బాలభక్త బృందం సభ్యులు కూడా గణపతి నవరాత్రి ఉత్సవాలకు రాటముహూర్తం చేశారు. అలాగే పెదకొత్తూరు, పెనుగుదురు, పెద్దాపురప్పాడు, వేళంగి తదితతర గ్రామాల్లో పందిరి రాటలు వేసి చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలు పరిశీలిస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50కి పైగా డిజనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లు తీసుకుచ్చి నగర ప్రజలకు లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలు పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 12వ తేదీ రాత్రి 9 గంటల వరకూ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోటరీ సేవలు మరింత విస్తృతం



రోటరీ గవర్నర్ సుబ్బారావును సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాలని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) క్లబ్ సభ్యులకు పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సెంట్రల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సూర్యకళామందిరంలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల క్లబ్ సభ్యుల రీజనల్ సెమినార్ నిర్వహించారు. ఇప్పటి వరకూ రోటరీ ప్రపంచంలోని 220 దేశాల్లో తమ సేవలను అందిస్తోందన్నారు. దీనిలో అతి ప్రధానమైనదని పోలియో నిర్మూలన అన్నారు. పోలియోను ప్రపంచం నుంచి పాలదోలడానికి మరికొంత సమయం పడుతోందని దానికి రోటరీ మరింత కృషి చేస్తోందన్నారు. జిల్లాలోని మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు గవర్నర్ రావూరి సుబ్బారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కాకినాడ సెంట్రల్ క్లబ్ అధ్యక్షులు ఎం.విద్యాసాగర్, సెక్రటరీ ఎం.వెంకట్, మాజీ గవర్నర్లు ఎల్.సత్యనారాయణన్, ఎస్‌వీఎస్ రావు, ఆంజనేయమూర్తి, బాబి, క్లబ్ డైరెక్టర్ వేణు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి వేణు పరామర్శ



సత్తిబాబు కుమార్తెను పరామర్శిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కరప: మండలం పెనుగుదురులో ఆదివారం స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి సమాచార, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల క్రితం మృతి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు పితాని సత్తిబాబు చిత్రపటానికి మంత్రి నివాళులు అర్పించి కుటుంబానికి సంతాపం తెలిపారు. పార్టీ నాయకులు రెడ్డిపల్లి ఆది ప్రభాకర్, వాసంశెట్టి వెంకటరమణ, సూరంపూడి సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు చెక్

- గడప గడపకూ నిధులతో మోక్షం
- హామీలు నెరవేర్చిన ఎమ్మెల్యే కన్నబాబు
- హర్షం వ్యక్తం చేస్తున్న కరప గ్రామస్తులు



కరపలో శ్మశానానికి వెళ్లే సీసీ రోడ్డు



పుంత మార్గానికి వేసిన గ్రావెల్ రోడ్డు

కరప: గ్రామంలో దీర్ఘకాలిక సమస్యలు 'గడప గడపకూ' నిధులతో పరిష్కారం అవుతుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్లు, డ్రైన్ల సమస్యలకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేసి పరిష్కరించారు. ప్రధానంగా శ్మశానానికి వెళ్లే దారి, నీలయ్యతోట, మెరకవీధి, పల్లపువీధి, అగ్నికుల క్షత్రియులవీధి, కొత్తపేట తదితర వీధులలో రోడ్లు, డ్రైన్లు మెరుగయ్యాయి. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే కన్నబాబు స్థానికుల సమస్యలు తెలుసుకుని ఇచ్చిన హామీ మేరకు రెండు నెలల్లో రూ.80 లక్షలు మంజూరు చేసి సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. రైతుల కోసం రెండు పుంత మార్గాలను రూ.9.8 లక్షలతో గ్రావెల్ రోడ్లు వేశారు. వారం, పది రోజుల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తికానున్నాయి. ఇవి కాక గ్రామ శివారు రామకంచిరాజునగర్ కాలనీలో రూ.15 లక్షలతో డ్రైన్ నిర్మిస్తున్నారు.

రూ.1.5 కోట్ల విలువైన పనులు



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల్లో స్థానికులు చెప్పిన సమస్యలపై రూ.1.5 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కన్నబాబు రూ.80 లక్షలు మంజూరు చేయగా, జెడ్పీ, మండల పరిషత్ నిధులు మరో రూ.70 లక్షలు మంజూరు చేశారు. సీసీ డ్రైన్లు, రోడ్లు వేయిస్తున్నారు.

– సాదే ఆశాజ్యోతి, సర్పంచ్, కరప

ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో..



గ్రామంలో శ్మశానానికి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా ఉండేది. వివిధ ప్రాంతాలలో రోడ్లు, డ్రెయిన్లు లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. ఎమ్మెల్యే చొరవతో గడప గడపకూ నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.

– పొట్నీడి భీమేశ్వరరావు, వైఎస్‌ఎంపీపీ, కరప

సాగరతీరం.. జనహోరం



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగరతీరం

- పర్యాటకులతో కిటకిటలాడిన ఉప్పాడ తీరం
- బీచ్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం



కడలి కెరటాల్లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం లోవలోని తలుపులమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. కడలి కెరటాల్లో పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ–ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్సై రామలింగేశ్వరరావు తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.